ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు

ప్రైవేట్ దవాఖానల్లో జిల్లా వైద్య శాఖాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఆయా దవాఖానల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌తో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సిన అన్ని అనుమతులను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీరాంనగర్ ఎస్‌పీ హెచ్‌ఓ డాక్టర్ విజయనిర్మల జూబ్లీ హిల్స్ పరిధిలోని పలు ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు చేపడుతున్నారు.

- జూబ్లీహిల్స్

ఐఐఎంసీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో జాతీయ సేవా పథకం వాసవి దవాఖాన సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ కె. రఘువీర్ ప్రారంభించారు. పిల్లలు జంక్ ఫుడ్ తినడంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మంచి ఆహారాన్ని తీసుకొని వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమం లో వాసవి దవాఖాన చైర్మన్ చం ద్రయ్య, కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

- ఖైరతాబాద్

సమస్యలు లేకుండా చూస్తాం

అత్తాపూర్ డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామని జల మండలి డీజీఎం ఖాజా జవహర్ ఆలీ అన్నారు. రెడ్డి బస్తీ పోచమ్మ ఆలయం వద్ద నెలకొన్న సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన పర్యటించి పరిశీలించారు. పర్యటనలో అత్తాపూర్ డివిజన్ యువమోర్చా నాయకులు మిద్దెల ఉపేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వినాయక్, చెన్నయ్య, కాంతారెడ్డి, యాదిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పాలమాకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శాంతి శ్రీ

పద్మశాలీపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీపీడీవో కవిత

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని మహేశ్వరం ప్రాజెక్ట్ సీడీపీవో శాంతి శ్రీ తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోషక అభియాన్ – 2024లో భాగంగా పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పోషక విలువలు కలిగిన భోజనం తీసుకోవాలని, పండ్లు, గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, హెచ్ఎం మోహన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి : సీజనల్ వ్యాధులు దరిచేరకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో కవిత అన్నారు. పద్మశాలీ పురం 5వ అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో రామకృష్ణ మఠం కమిటీ హాల్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీడీపీవో కవిత మాట్లాడుతూ.. పోషణమాసం సందర్భంగా గర్భిణులు, తల్లులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లిపాలు శ్రేష్టమైనవని తల్లిపాలలోనే పోషక విలువలులు ఉంటాయని పిల్లలకు సమతుల్య ఆహారం అందించడం ద్వారా బలంగా , దృఢంగా ఉంటారని మానసిక వికాసం అభివృద్ధి చెందుతారన్నారు. మెడికల్ ఆఫీసర్ రేఖ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని హ్యాండ్‌వాష్ తదితర అలవాట్లను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు జరిగాయని, ప్రజలు ఆనందంగా ఉన్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

– జూబ్లీహిల్స్

రక్తదానం మరొకరికి ప్రాణదానం

యవ్వన దశ నుంచి 50 ఏండ్ల వరకు ఇవ్వొచ్చు

రక్తదాన శిబిరాన్ని సందర్శించిన రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 25 : రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డా.రఘురామి రెడ్డి అన్నారు. బుధవారం వర్సిటీ ఆడిటోరియం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రిజిస్ట్రార్ పాల్గొన్నారు. యవ్వన దశ నుంచి 50 ఏండ్ల వరకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని రిజిస్ట్రార్ సూచించారు. పి.జె.టి.ఎస్.ఎ.యు., ఎం.ఎన్.జె. క్యాన్సర్ దవాఖాన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఎ. జెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. గాయపడ్డపుడు, ప్రమాదం జరిగినపుడు రక్తం అవసరం పడుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ రాంప్రసాద్, అధ్యక్షుడు డా. ఆర్.జగదీశ్వర్, కళాశాల అసోషియేట్ డీన్ నరేందర్ రెడ్డి, డా.అనిత, డా.జమునా రాణి, విజయ లక్ష్మి, డా.అరుణ, ఎం.ఎన్.జె. క్యాన్సర్ దవాఖాన వైద్యురాలు డా.పద్మవేణి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది. విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి దాండియా, బతుకమ్మ నైట్స్

ఈవెంట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సినీనటుడు భరద్వాజ్, కవితాశెట్టి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 25 : దేశ సంప్రదాయ దాండియా, తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మ ఆటల మేళవింపుగా అక్టోబర్ 4 నుంచి 6 నార్సింగ్‌లోని ఓమ్ కనెక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆరమ్ ఈవెంట్స్ సీఈవో కవితాశెట్టి తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో మీడియా సమావేశంలో ఈవెంట్‌కు సంబంధించిన బ్రోచర్లు, టీజర్‌ను సినీనటుడు భరద్వాజ్, డీజే పీయూష్ బజాజ్ ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా సినీనటి శ్రీముఖి నేతృత్వంలో బతుకమ్మ ఆటలు, లైఫ్, లైవ్ మ్యూజిక్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్వప్న రెడ్డి, పీత్రి, వెంకట్ పాల్గొన్నారు.

28 నుంచి తల్లిపాల విశిష్టతపై.. అంతర్జాతీయ సదస్సు

తల్లిపాల విశిష్టతపై 28 నుంచి హోటల్ మారిగోల్డ్‌లో లాంబ్‌కాన్ 2024 పేరుతో 4వ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ పీడియాట్రిషియన్, నియోజనాటాలజిస్ట్ డా. కలవలపల్లి దుర్గాభవాని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో సదస్సు బ్రోచర్లను నిర్వహణ కమిటీ కార్యదర్శి డా.నితాషాబగ్గాతో ఆవిష్కరించారు. సుషీనాహెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్ మిల్క్‌బ్యాంక్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోజనాటాలజీ ఫోరం, రిషిహుడ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని దుర్గాభవాని తెలిపారు. దేశ, విదేశాల నుంచి 900 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

- ఖైరతాబాద్

ఇండోర్ పర్యటనలో గ్రేటర్ బృందం

ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ భార్గవ్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ సీఎన్.రెడ్డి

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 25 : హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బృందం స్టడీ టూర్ చేపడుతున్నారు. స్వచ్ఛతలో 7 సార్లు జాతీయస్థాయి అవార్డులు గెల్చుకున్న ఇండోర్ మున్సిపాలిటీని బుధవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డితో పాటు నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్లు సందర్శించారు. పారిశుధ్య ప్రమాణాలు పెంచేందుకు గ్రేటర్ మున్సిపాలిటీ కార్పొరేషన్ బృందం మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో పాల్గొని స్వచ్ఛత సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలను చర్చించినట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 25 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. బుధవారం అవినాష్ కాలేజీలో ' రోడ్డు భద్రత – ట్రాఫిక్ నియమాలు' పై అవగాహన కల్పించారు. శంకర్‌రాజు మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతే వాహనాలు నడపాలని, ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. త్రిబుల్ రైడింగ్, ఫోన్‌లో మాట్లాడటం, మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, సిగ్నల్స్ జంపింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ సావిత్రి, ఓఎస్‌డీ కపిల్, హెచ్ఓడీ దీప, టీటీఐ ప్రతినిధి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన నిజాం మునిమనమడు

ఖైరతాబాద్ : నిమ్స్‌ను నిజాం మునిమనమడు నవాబ్ నజీఫ్ అలీ ఖాన్ బుధవారం సందర్శించారు. రెండు రోజులుగా బ్రిటన్ వైద్యులు దన్నపనేని రమణ వైద్య బృందం, నిమ్స్ కార్డియోథోరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర్ రావు నేతృత్వంలో చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా కొనసాగుతున్న గుండె శస్త్రచికిత్సలపై ఆయన ఆరా తీశారు. స్వయంగా మిలీనియమ్ బ్లాక్‌లోని పీడియాట్రిక్ గుండె విభాగాలను పరిశీలించి , ఉచిత చికిత్స అందిస్తున్న వైద్యులను అభినందించి, సన్మానించారు.

రాజీమార్గమే రాజమార్గం

వెంగళరావునగర్, సెప్టెంబర్ 25 : రాజీ మార్గమే రాజ మార్గమని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు కోరారు. బుధవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యాభర్తల పంచాయితీ, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పెండింగ్ చలానాలు, కొట్లాటలు, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్ కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌ను వినియోగించుకునేందుకు వివరాలకు ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

పోలీసుల్ని దూషించిన నిందితుడికి జైలు శిక్ష

వెంగళరావునగర్, సెప్టెంబర్ 25 : సాయం చేయడానికి వచ్చిన పోలీసుల్ని దూషించిన నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఎస్. పవన్ మద్యం మత్తులో బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ.. ప్రమాదవశాత్తు మధురానగర్ పీఎస్ ఎదుట పడిపోయారు. కిందపడ్డ వారికి సాయం చేసేందుకు వెళ్లిన పోలీసులను పవన్ దూషించి దురుసుగా ప్రవర్తించాడు. శ్వాసపరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్టు నిర్ధారణ అయింది. ఈ – పెట్టి కేసు నమోదు చేసి నాంపల్లి 10వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మురళి ఎదుట హాజరుపర్చగా దోషికి 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. దోషిని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ..ఆదర్శ గ్రామాలు

16వ వార్డులో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

అమ్మపల్లి ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్ : పరిసరాల పరిశుభ్రతతోనే గ్రామాలు ఆదర్శంగా మారుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, జడ్పీ సీఈవో సీహెచ్ కృష్ణరెడ్డి అన్నారు. బుధవారం నర్కూడ అమ్మపల్లి ఆలయం వద్ద స్వచ్ఛతా హి సేవ 2024లో భాగంగా ఆలయ పరిసరాలను చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ మాజీ జడ్పీటీసీ తన్విరాజు, ఎంపీడీవో మున్ని, నాయకులు నీరటి రాజుముదిరాజ్, చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దులు, ఈవో రామశర్మ, వైర్మన్ వినోద్‌కుమార్, ఆలయ డైరెక్టర్లు శ్రీనివాస్, అశోక్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, విశ్వనాథం, మాజీ సర్పంచ్‌లు ఇస్తారి, రమేశ్‌యాదవ్, ఆయా గ్రామాల డ్వాక్రా మహిళలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న కలెక్టర్

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా అమ్మపల్లి ఆలయానికి ఆలస్యంగా వచ్చిన కలెక్టర్ శశాంక అమ్మపల్లి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రం చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఆయనతో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఆర్ఐ సారిక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శంగా మణికొండ మున్సిపాలిటీ

మణికొండ : మణికొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధునాతన పద్ధతులు పాటిస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. 7వ వార్డులోని వైఎస్ఆర్ కాలనీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా 12 లక్షలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. 17వ వార్డులోని శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.50 లక్షలతో బీటీ రోడ్డు పనులను, 16వ వార్డులోని ఎంప్లాయిస్ కాలనీలో రూ.34 లక్షలతో కమ్యూనిటీ హాల్ ఫస్ట్ ఫ్లోర్ పనులు, రూ.42 లక్షలతో స్మాట్ హైడ్రాలిక్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని సత్వరమే పరిష్కరించేలా చూస్తున్నానన్నారు. ఎప్పటికప్పుడు పర్యటనలు నిర్వహించి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై చర్చించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని సూచించడం జరిగిందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎక్కడైనా నాణ్యత లోపిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే పనులకు ఆటంకం కలుగకుండా అందరూ అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ పర్సన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్, డీఈఈ దివ్యజ్యోతి, కౌన్సిలర్లు, కో – ఆప్షన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీకోర్సులో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 25 : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024 –25 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సులో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనాయని నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ సి.వి.లక్ష్మీ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేండ్ల ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత సర్టిఫికెట్స్‌తో కాలేజీకి వచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. తర్వాత ఆన్‌లైన్ ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. అదే విధంగా రెండవ, మూడవ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించే వారు సైతం 30 లోపు చెల్లించాలని, పూర్తి సమాచారం కోసం 7382929630 ను సంప్రదించాలని సూచించారు.

28న మహవీర్ కళాశాలలో మెగాజాబ్ మేళా

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 25 : మహవీర్ కళాశాలలో 28న నిర్వహించే మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఆడిటోరియంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం 50 కంపెనీల ప్రతినిధలు వస్తారని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సదద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ విద్యార్థి ఐదు సెట్ల రెజ్యూమ్, కలర్ ఫొటోతో రావాలని సూచించారు. ఉదయం 9 :30 గంటలకు కళాశాలలో మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ నందగోపాల్ రెడ్డి, డాక్టర్ ప్రతిభా భారతి, కళాశాల వైర్మన్ సంరెడ్డి జయలక్ష్మి పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

కరాటే పోటీల్లో పతకాలు గెల్చుకున్న ఎస్ఎస్ఎస్‌వీ విద్యార్థులు

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 25 : యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిసరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్కూల్ కరాటే టోర్నమెంట్‌లో సత్తా చాటారు. యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో అండర్–14 విభాగంలో 6 వ తరగతి విద్యార్థి సాహితి బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. 8 వ తరగతి విద్యార్థి పి.లోహిత్ శౌర్య, 7 వ తరగతి విద్యార్థి ఎ.చక్రేష్ కుమార్ కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్‌పర్సన్ శిరీషా భవానీశంకర్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు, కోచ్ మాస్టర్ వాసుదేవ్‌కు అభినందనలు తెలిపారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 25 : భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాలు బుధవారం జరిగాయి. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన హైదర్‌గూడ వై జంక్షన్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరై దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోండ్ర కొమురయ్య, నర్సింహ, పుస్తకాల అశోక్, మల్లారెడ్డి, సులిగే వెంకటేశ్, నల్లింగ్ రమేశ్, కె.కృష్ణ, కె.కిరణ్‌చారి, గౌరీశంకర్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 25 : బహుముఖ ప్రజ్ఞాశాలి సీపీఐ మాజీ జాతీయ నేత ఏబీ బర్దన్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ అన్నారు. బర్దన్ జయంతి సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో బర్దన్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆర్.అంజయ్య నాయక్, విజయలక్ష్మి, కాసోజు మహాలక్ష్మి, గోవింద్, శ్రీరాములు, అంజయ్య పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Kurnella Veeranjaneyulu** is acquiring Flat/Unit No.407, 4th Floor, Block No.MIG 6-407, Built up area 996 Sq.yds., with an undivided share of land admeasuring 29.37 Sq.yds., out of 67 Acres 16 Guntas, In Survey No. 246/1, Situated at Manikonda Jagir Village, Gandipet Mandal, Ranga Reddy District from Kundapura Pranitha Gota (who acquired the same vide Registered Conveyance Deed no. 9498/2022 dated 25-10-2022). The original document Registered Conveyance Deed no. 9498/2022 dated 25-10-2022 is lost.
Whosoever has found the above mentioned original document and whoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.